సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. వారిలో ఇచ్చోడకు చెందిన మోహితే అవినాష్‌కు మంజూరైన రూ. 16,500, బోథ్ మండలానికి చెందిన గాండ్ల బాలరాజుకు రూ.54 వేలు, చిట్టి అనసూయకు రూ.11,500, విజయ కుడాలకు రూ.12 వేలు, బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన మెరుగు జనార్ధన్‌రెడ్డికి రూ.25 వేల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


● ఉట్నూర్‌లోని 50 పడకల ఆసుపత్రి


● ఆసుపత్రిలో వైద్యం అందుకుంటున్న రోగులు

పేరుకే.. పెద్ద ఆసుపత్రి!

- ఆసుపత్రిలో వైద్యుల కరువు
- ఆరుబయట శవ పరీక్షలు
- ఉన్న వైద్య సిబ్బందిపై అదనపు భారం
- వెనక్కు వెళ్లిన ఎంసీహెచ్ భవన నిర్మాణ నిధులు
- ఇదీ ఉట్నూర్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తీరు

ఉట్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తీరు ఉంది. జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో రాజీవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజ్ (రిమ్స్) ఏర్పాటు చేయడం వల్ల అక్కడి జిల్లా ఆసుపత్రిని ఉట్నూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ సివిల్ ఆసుపత్రికి మార్చి జిల్లా ఆసుపత్రిగా ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా ఆసుపత్రి హోదా కల్పించిన ప్రభుత్వం జిల్లా స్థాయిలోనే సిబ్బందిని నియమించడంలో విఫలం కావడంతో ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి అవస్థల్లో కొట్టుమిట్టాడుతుంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన సిర్పూర్(యు), లింగాపూర్, జైనూర్, గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలకు చెందిన రోగులు ఆధారపడి ఉంటారు. ఉట్నూర్‌లోని కమ్యూనిటీ సివిల్ ఆసుపత్రిని గత ప్రభుత్వం 2018లో జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య సేవలు అందించడానికి డాక్టర్లతో పాటు వైద్య సిబ్బంది వంద మంది వరకు అవసరం అవుతారు. కానీ ప్రస్తుతం జిల్లా ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రకటించినా.. నేటికి కూడా కావాల్సిన వైద్య సిబ్బందిని నియమించ లేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయి సిబ్బందితో కాలం నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతం లోని రోగులకు సక్రమంగా ఆశిస్తున్న స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. జిల్లా కేంద్ర ఆసుపత్రి మంజూరు అయితే రేడియోలాజిస్టు సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కానీ, ప్రస్తుతం ఉన్న డయాలసిస్ కేంద్రంలో కేవలం ఐదు మిషన్‌లు ఉండడం వల్ల ఇతర ప్రాంతాలైన జన్నారం, దండేపల్లి, జైనూర్, సిర్పూర్(యు, లింగాపూర్, కెరమెరి, నార్నూర్, గాదిగూడ మండలాల నుంచి వస్తున్న రోగులకు సక్రమంగా డయాలసిస్ సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. మరో ఐదు మిషన్‌లు పెంచితే ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన డయాలసిస్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.

ఆసుపత్రిలో నిపుణులు ఏరీ?

ఉట్నూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు చికిత్సలు అందజేయడంతో పాటు చర్మవ్యాధి డాక్టర్లు కూడా అవసరం ఉంది. 12 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు కావాల్సి ఉండగా.. నలుగురు మాత్రమే ఉన్నారు. ఆర్ఎంవో పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటీ సివిల్ సర్జన్లు 12 మంది అవసరం ఉండగా ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. డిప్యూటీ డెంటల్ సర్జన్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా.. ఒకరే ఉన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 32 మంది ఉండాల్సి ఉండగా.. 11 ఖాళీలు, హెడ్ నర్సులు మూడు ఖాళీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఒక ఖాళీ, స్టాఫ్ నర్సులు 26 మంది ఉండాల్సి ఉండగా.. 12 ఖాళీలు ఉన్నాయి. డాక్టర్లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్,

(తరువాయి 6వ పేజీలో...)

వైద్యులను నియమించాలి
: రాథోడ్ రితేష్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు



ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి కావాల్సిన డాక్టర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలి. ఉట్నూర్ ఏజెన్సీలోని రోగులందరూ వైద్యం కోసం ఉట్నూర్ వస్తున్నందున.. సత్వర వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి. ఎంసీహెచ్ భవనం నిర్మించి ఏజెన్సీ ప్రాంతాల మహిళలు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి.

కమిషనర్ దృష్టికి సమస్యలు
: డాక్టర్ జాదవ్ ఉపేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్



ఉట్నూర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ దృష్టికి ఆసుపత్రి సమస్యలను తీసుకు వెళ్లాను. కరెంట్ పోయినప్పుడు జనరేటర్ సౌకర్యం కావాలని, మార్చురి గది నిర్మించాలని, డాక్టర్లను నియమించాలని కోరడంతో పాటు ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారన్నారు. అలాగే, 2018లో మంజూరైన మాతా శిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణం కాకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాలకు నిరాశ మిగిలింది.


జూనియర్ కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి గణేష్ కుమార్

విద్యార్థుల అడ్మిషన్‌లపై సమీక్ష

నార్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్‌లు పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి గణేష్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కళాశాల అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరు కూడా విద్యార్థులు డ్రాపౌట్ లేకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. వారి తల్లిదండ్రులకు సంబంధిత అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక్కడ మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు బాలాజీ కాంబ్లే, ఉదయ్, అజయ్, వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.


బాదిగూడ గ్రామశివారులో పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తున్న ఆదివాసీలు

బాదిగూడలో సంప్రదాయ రీతిలో ఆదివాసీల ఆకాడి పూజలు

ఇచ్చోడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదిగూడ వాసులు సంప్రదాయ రీతిలో ఆకాడి పూజలు నిర్వహించారు. ఆదివారం బాదిగూడ గ్రామ శివారులో గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆకాడి రాజుల్‌పేన్ పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ప్రతి ఏటా ఆశాడ మాసంలో నిర్వహించే వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామపెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ సిడాం లక్ష్మీకాంత్, దేవరి పెందూర్ బండు, తులసీరాం, గ్రామపెద్దలు చిక్రం దేవ్‌రావ్, మధుకర్, తిరుపతి, అమృత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల పాటు స్విమ్మింగ్‌పూల్ మూసివేత

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను జూలై 1నుంచి 4వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు నిర్వాహకుడు రాష్ట్రపాల్ జబాడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కలుషితమైందన్నారు. వాటిని పూర్తిస్థాయిలో తొలగించి కొత్తనీరును నింపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఈత సాధకులు, పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

కష్టపడి చదివితేనే ప్రభుత్వ ఉద్యోగాలు : ఎస్సై

బోథ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగాలను కల్పిస్తున్నాయని అన్నారు. అంతేకాకుండా ఉద్యోగ సాధనకు కష్టపడి చదవాలని పేర్కొన్నారు. అగ్నివీర్ ఉచిత అవగాహన పరీక్ష నిర్వహణ వల్ల పరీక్షపై మంచి అవగాహన వస్తుందన్నారు. కాగా దాదాపు 200 మంది వరకు ఈ పరీక్ష రాయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ నిపుణులు రమణ గౌడ్, సాయికృష్ణ, చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కో ఆర్డినేటర్ ఎర్రోళ్ల సతీష్, సోల్జర్ గ్రూప్ ఫౌండర్ కృష్ణ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.


బోథ్‌లో లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై

నకిలీ ధ్రువపత్రాల దందాలో ముగ్గురి అరెస్టు

- తప్పుడు పత్రాల కోసం రూ.9 లక్షలకు ఒప్పందం
- ముగ్గురిపై కేసు నమోదు రిమాండ్
- ఇతర రాష్ట్రాల యువకులు.. తెలంగాణ నుంచి సెంట్రల్ ఫోర్స్‌లో ఉద్యోగాలు
- వివరాలు వెల్లడించిన ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్

ఇచ్చోడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో కీలక విధులు నిర్వర్తించే ఐటీబీపీ దళంలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారి ధ్రువపత్రాల పరిశీలనలో నకిలీ నివాస ధ్రువ పత్రాలతో ఉద్యోగాలు పొందేందుకు సహకరించిన ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ కాజల్‌సింగ్ తెలిపారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తప్పుడు పత్రాలతో భారత సైన్యంలో ఉద్యోగాలు పొందిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటనలో ఉద్యోగాలు పొందిన తొమ్మిది మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. ఇచ్చోడ మండలంలోని ఇస్లాం నగర్ గ్రామంలో నకిలీ ధ్రువపత్రాల కుంభకోణం జరిగిన విషయం విదితమే. అయితే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన తొమ్మిది మంది స్థానికుల సహాయంతో తప్పుడు పత్రాలైన పదో తరగతి మార్కుల ధ్రువీకరణ పత్రం, ఆధారు కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఇతర రాష్ట్ర యువకులు తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర బలగాల్లో ఉద్యోగాలు పొందారు. ఈ ఘటనపై ఏప్రిల్ నెలలో ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల విచారణలో మొదట 12 మందిని గుర్తించగా.. వారిలో తొమ్మిది మందికి ఇచ్చోడలోని మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా తప్పుడు పత్రాలను తయారు చేయించారు. తప్పుడు పత్రాలకు సహకరించిన ఇస్లాంనగర్‌కు చెందిన షేక్ ఫరీద్, జాదవ్ గజానంద్, ఇచ్చోడకు చెందిన షేక్ కలీంలు తొమ్మిది మంది నుంచి రూ.9 లక్షలను నగదు రూపంలో తీసుకొని ధ్రువపత్రాలను పొందారు. తప్పుడు పత్రాలతో ఆర్మీల్లో ఉద్యోగాలు వచ్చేలా సహకరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ కాజల్ సింగ్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ కేసుతో సంబంధం ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ముమ్మర దర్యాప్తు చేపడుతున్నామని, వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇందులో ఇంకా ఎంతమంది ఉన్నారో? ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతవరకు ఉందోనని విచారణ జరుపుతున్నామన్నారు. ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికైన వారికి నోటీసులు పంపించామన్నారు. ఈ సమావేశంలో సీఐ బండారి రాజు, ఎస్సై పురుషొత్తం, తదితరులు ఉన్నారు.



● ఇచ్చోడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్

మంత్రి సీతక్కపై మాట పడనివ్వను : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి, మహిళ సంక్షేమ శాఖ మంత్రి సీతక్కపై ఎవరు ఆరోపణలు చేసిన తాను మొదటి వ్యక్తిగా ఆక్షేపిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఒక దిన పత్రికలో (ఆంధ్రజ్యోతి కాదు) ఆదివాసీ గిరిజన మంత్రి పట్ల అసభ్య పదజాలం వాడుతూ వార్త ప్రచురించడం జరిగిందని అన్నారు. ములుగు జిల్లాలో గుత్తి కోయలను గతంలో ఉన్న ప్రభుత్వం అనేక చిత్రహింసలకు గురి చేసినప్పుడు ఎవరూ మాట్లాడలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో అమాయక ఆదివాసీలను హతమరుస్తుందన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు మైనింగ్ భూములను అప్పగించడానికి కేంద్రం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఒక ఆదివాసీ గిరిజన మహిళ జనరల్ పోర్ట్‌ఫోలియోలో పని చేస్తుంటే ఇమిడించుకోలేక పోతున్నారని విమర్శించారు. గతంలో ఉన్న ప్రభుత్వం చేయలేని పనులను తాను చేస్తుంటే.. కొందరు అప్పుడు తాము చేశామని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. తన గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం కల్పించుకోలేని నాయకుడు విమర్శిస్తాడా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేయకుండా హైదరాబాద్‌లో ధర్నా చౌక్‌ను ఎత్తి వేసిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌ను పునరుద్ధరించి ధర్నాలు చేస్తేనే ప్రజల సమస్యలు బయటకు వస్తాయని ప్రభుత్వం గుర్తించిందని ఎమ్మెల్యే పలు అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆత్రం రాహుల్, జిల్లా కాంగ్రెస్ నాయకులు జాదవ్ జగదీశ్‌లు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మహాలనోబిస్ సేవలు ఎనలేనివి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గణాంకాలు, ఆర్థిక ప్రణాళిక రంగంలో ప్రశాంతచంద్ర మహాలనోబిస్ చేసిన సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతి, 19వ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణాంకాలు,ఆర్థిక ప్రణాళిక రంగంలో మహాలనోబిస్ చేసిన కృషికి గుర్తింపుగా జూన్ 29న జాతీయగణాంక దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం తీర్మాణించిందన్నారు.జాతీయ ఆదాయాన్ని అంచనా వేయడంలో, ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో గణాంకాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.గణాంక కార్యకలాపాలను సమన్వయం చేయడానికి మహలనోబిస్ వివిధ సంస్థలు, పద్ధతులను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.అందుకే ఆధునిక భారత గణాంక పితామహుడిగా ఆయనను పిలుస్తారన్నారు.ఇందులో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి.వెంకటరమణ, డివిజనల్, మండల గణాంక అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ రాథోడ్ విగ్రహావిష్కరణ

ఉట్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డైనమిక్ లీడర్గా పేరు పొందిన రమేష్‌రాథోడ్ విగ్రహావిష్కరణ, ప్రథమ వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో స్వర్గీయ రాథోడ్‌రమేష్ కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే సుమన్‌రాథోడ్,నిర్మల్ బీజేపీ జిల్లా అధ్యక్షులు రాథోడ్‌రితేష్, ఐఏఎస్ అధికారి రాహుల్‌రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ప్రముఖ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై నివాళులు అర్పించారు. బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడంనగేష్, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్; ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ మంత్రులు ఐకేరెడ్డి, అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్లు రాథోడ్‌జనార్ధన్, లోలం శ్యాంసుందర్, టీఆర్ఎస్ ఖానాపూర్ నియోజక వర్గం ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్‌లతో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీలు ఏదైనా ఉమ్మడి జిల్లా ఒక మంచి నాయకున్ని కోల్పోయిందని పేర్కొన్నారు.


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నారాయణరావు పటేల్, హరీష్‌బాబు, తదితరులు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు : డీసీసీబీ చైర్మన్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన తీవ్ర నిరాశను మిగిల్చిందని విమర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న గతంలో జిల్లాకు ఏం ఒరగబెట్టారో చెప్పాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి పర్యటనపై జోగు రామన్న చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ పదేళ్ల అధికారమిస్తే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని పలు అంశాలపై మాట్లాడారు. ఇందులో గిమ్మ సంతోష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, నాయకులు సంద నర్సింగ్, రఫీక్, బూర్ల శంకరయ్య, రాజేశ్వర్, ఖయ్యుం, తోఫిక్, సాహెబ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

సహకార సొసైటీలో కర్షక మిత్ర రుణాలు

తాంసి: సహకార సొసైటీలో కర్షక మిత్ర రుణాలను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరుచుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సహకార సొసైటీలో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందిస్తున్నామన్నారు. కర్షక మిత్ర పథకం ద్వారా ఎకరానికి రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలకు 12శాతం వడ్డీ వసూలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని సహకార సంఘాలలో రైతులకు రుణాలతో పాటు గృహ రుణాలు కూడా అందిస్తున్నామన్నారు. ఇందులో సీఈవో కేశవ్, సొసైటీ ఉపాధ్యక్షుడు ధనం జయ్, సభ్యులు సామ సంతోష్ రెడ్డి, రమేష్, బుజ్జన్న, గంగమ్మ, అశోక్ రెడ్డి, తదితరులున్నారు.

భయంకరంగా బస్టాండ్!

- ఇచ్చోడలో వర్షాకాలం బురదతో తీవ్ర ఇక్కట్లు
- చీకటి పడితే దొంగల భయం
- బస్టాండుకు శాశ్వత మరమ్మతులు కరవు

7లో

ప్రభుత్వ బడి ముద్దు!!

- ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో బడి బాట పడుతున్న బడీడు పిల్లలు
- నార్నూర్ మండలం ముక్తాపూర్ బడిలో ప్రస్తుతం 45 మంది విద్యార్థులు



ఉట్నూర్ నుంచి ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

పీఎం మన్ కీ బాత్‌లో ఎంపీ, ఎమ్మెల్యేలు

ఉట్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్, ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల శంకర్‌లు పాల్గొన్నారు. ఆదివారం ఉట్నూర్ ప్రాంతంలో జరిగిన దివంగత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు.. ఉట్నూర్ నుంచి ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమం 123వది అన్నారు. అంతేకాకుండా ఈ మనకీ బాత్‌లో ప్రధానమంత్రి ప్రసంగం దేశ భవిష్యత్తు ఉద్దేశించి.. దేశంలోని వెనుకబడిన బలహీన మరియు అన్ని వర్గాలకు సంబంధించిన దిశానిర్దేశం గురించి ప్రసంగించడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి వెంట ఉట్నూర్ మండల బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, నాయకులు కనక తుకారాం, రాజశేఖర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా : ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

బోథ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి న్యాయం జరిగే విధంగా చూస్తామని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయుడు బ్రహ్మానంద్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పదని అయితే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ప్రభుత్వం నుంచి రావాల్సిందేనన్నారు. అయితే ప్రభుత్వం వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్లను ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్‌లో ట్రావెల్స్ బస్సు బోల్తా

గుడిహత్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. ఆరెంజ్ ట్రావెల్ ప్రయివేటు బస్సు హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని అమరావతికి వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న వాహనం ఓవర్ టెక్ చేస్తుండగా.. ఆరెంజ్ ట్రావెల్ బస్సు డ్రైవర్ వేగంగా నిర్లక్ష్యంగా నడపడంతో అదుపుతప్పి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై నుంచి సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. బస్సులో మొత్తం 32 మంది ప్రయాణికులు ఉన్నారు. మావలకు చెందిన నరేంద్ర, యవాత్మల్‌కు చెందిన ఇర్ఫాన్ మాన్సరి, ఎండీ హార్బజ్, ఆనంద్ అగర్వాల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, బస్సు బోల్తా పడిన విషయం తెలవగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరందరినీ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇర్ఫాన్ మాన్సరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ రెఫర్ చేసినట్లు తెలిపారు. బోల్తా పడిన బస్సును క్రేన్‌తో అక్కడి నుంచి తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకృష్ణ తెలిపారు.

పట్టుకున్న క్లోరల్ హైడ్రేడ్ ఎవరిది!?

● కేసు నమోదుపై అధికారుల తాత్సారం



● పట్టుకున్న క్లోరల్ హైడ్రేడ్ ఇదే..

తాంసి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల క్రితం తాంసి మండల కేంద్రంలోని గ్రామ శివారులో ఉన్న ఓ పశువుల పాకలో 20 కేజీల క్లోరల్ హైడ్రేట్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. అయితే ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి పక్కన ఉన్న నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి ఆదిలాబాద్ తరలించి గ్రామాల వారీగా ఆయా షాప్‌లకు క్లోరల్ హైడ్రేట్‌ను సరఫరా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టారు. క్లోరల్ హైడ్రేట్ నిల్వ ఉంచిన విషయాన్ని పక్కా సమాచారంతో అబ్కారీ బృందం ఘటన స్థలానికి చేరుకొని సుమారు రూ.32 వేల విలువ గల క్లోరల్ హైడ్రేట్ పట్టుకున్నారు. అంతేకాకుండా నిషేధిత క్లోరల్ హైడ్రేట్ పదార్థాన్ని పట్టుకున్న విషయాన్ని బయటకు రానీయకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. కాగా తనిఖీల్లో సుమారుగా 20 కిలోల క్లోరల్ హైడ్రేట్ పట్టుకున్నట్లు తెలుస్తుండగా.. సంబంధిత అధికారులు మాత్రం గ్రామశివారులో ఖాళీగా ఉన్న స్థలంలో కేవలం మూడు నుంచి నాలుగు కిలోలు మాత్రమే పట్టుకున్నట్లు చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచడంతో అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టుకున్న ఆ క్లోరల్ హైడ్రేట్ ఎవరిదనే విషయంపై ఇప్పటికీ స్పష్టత రాకపోవడం విడ్డూరం. దీంతో పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. పక్క సమాచారంతో పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు అది ఎవరు? అనే విషయంపై ఎందుకు ఆరా తీయడం లేదని పలువురు యువకులు ప్రశ్నిస్తున్నారు.



నెత్తిన బోనాలు పెట్టుకుని శోభాయాత్రగా వస్తున్న మహిళలు, భక్తులు



శోభాయాత్రలో పోతరాజు విన్యాసాలు

ఘనంగా మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

● ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ మారెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా చేపట్టారు. స్థానిక శివాజీ చౌక్‌లోని మారెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలను ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించారు. కాలనీ మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని శోభయాత్రగా ఆలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. అంతేకాకుండా భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులతో శివాజీ చౌక్ ప్రాంగణం సందడిగా మారింది. మహిళలు మంగళ హారతులతో శోభాయాత్రలో పాల్గొనగా.. పోతరాజు విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారికి సామూహిక నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.



ఊరేగింపుగా తరలివెళ్తున్న రజకులు

రజక సంఘం ఆధ్వర్యంలో బోనాలు

బోథ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోచమ్మ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పండాలని కోరుతూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రజక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'దళితులకు భూమిపై హక్కులు ఇవ్వండి'

నార్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉన్న దళిత ప్రజలకు వారు సాగు చేయు భూములపై పూర్తి హక్కులు కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా మహర్ బెటాలియన్ అధ్యక్షుడు సంతోష్ మానే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్నా.. అధికారంలోకి ఎన్నో ప్రభుత్వాలు వస్తున్నా.. పోతున్నా.. ఇక్కడ నివాసం ఉండే మా బతుకులు ఏం మారడం లేదన్నారు. 1970 కంటే ముందు ఉన్న వారి సాగు భూములకు పట్టాలు ఇవ్వండి, 1970 తర్వాత కాస్తులో సాగు చేస్తున్న దళిత రైతులకు కనీసం పహనీలు ఇవ్వండి అంటూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేల సంఖ్యలో రైతులు కలిసి విన్నవించినా.. దరఖాస్తులు చేసినా.. ఇప్పటి వరకు ఎవరికీ న్యాయం జరగ లేదని అవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దళిత జాతికి పూర్తి హక్కులు కల్పించేలా ముందడుగు వేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ శివాజీ, లాలూ జాదవ్, గ్రామస్థులు ఉన్నారు.

పేరుకే.. పెద్ద ఆసుపత్రి!

(5వ పేజీ తరువాయి...)

ఎలక్ట్రిషన్, సెక్యూరిటీ గార్డులు ఇలా 135 మంది సేవలు అందించాల్సి ఉండగా.. ప్రస్తుతం కేవలం 72 మంది మాత్రమే పని చేస్తున్నారు. 63 ఖాళీలు ఉండగా.. రోగులకు సరైన సేవలు అందడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మార్చురి గది కరువాయే..

జిల్లా ఆస ఉపత్రికి ప్రత్యేక మార్చురి గది లేకపోవడంతో ఆరు బయట శవ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో రోగులు కరెంట్ అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. 120 కేవీ జనరేటర్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ఆసుపత్రికి కావాల్సినంత డాక్టర్లు కూడా లేకపోవడంతో పాటు మత్తు డాక్టర్, ముగ్గురు సాధారణ ఫిజిషియన్లు అవసరం ఉంది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న కొంత మంది డాక్టర్లకు పీజీ అవకాశాలు రావడంతో వారు వెళ్లి పోయారు. ఆసుపత్రిలో కంటి వైద్యం కోసం కావాల్సిన పరికరాలతో పాటు ఆపరేషన్ థియేటర్ ఎంతో అవసరం. ఇవేమీ లేకుండానే ఇద్దరు డాక్టర్లను నియమించడంతో వారు సాధారణ వైద్య సేవలు అందిస్తున్నారు. అందులో నుంచి ఒకరు బదిలీపై వెళ్లి పోయారు. ఇక్కడ ఉన్న ఆర్తోఫిజిషియన్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ కావడంతో ఉట్నూర్ ఆసుపత్రిలో ఎముకల డాక్టర్ కరువయ్యారు. అదేవిధంగా చిన్నపిల్లల వైద్యం అందించే డాక్టర్ సైతం లేకపోవడంతో చిన్నపిల్లలకు వ్యాధులు సంక్రమించి నప్పుడు ఈ ప్రాంత ప్రజలు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు.

అప్పటి పాలకులు విఫలం

గత ప్రభుత్వంలో మంజూరైన మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) భవనం నిర్మాణంలో అప్పటి పాలకులు విఫలమయ్యారు. 2018లో రూ.17 కోట్ల వ్యయంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం భవనం మంజూరు చేశారు. ఐటీడీఏ అధికారులు సైతం పండ్ల తోటలో ఉద్యానవన కేంద్రంలోని భూభాగంలో ఐదు ఎకరాల భూమి ఇవ్వడానికి సిద్ధమయ్యారు. కానీ నిర్మాణం ప్రారంభించకుండానే ఉండిపోవడంతో నిధులు వాపస్ వెళ్లి పోయాయి. గిరిజన ప్రాంతాల ప్రజలు, మహిళల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం మాతా శిశు ఆరోగ్య కేంద్రం తిరిగి మంజూరు చేయాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

భయ పెడుతున్న శునకాలు!!

● గొకొండలో కుక్కదాడిలో గాయపడిన తొమ్మిదేళ్ల బాలుడు

బజార్‌హత్నూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శునకాల సంచారంతో గ్రామీణులు బెంబెలెత్తుతున్నారు. ప్రధాన రోడ్లపై, వీధుల్లో రాత్రీపగలు అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు, చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా, శనివారం మండలంలోని గోకొండ గ్రామంలో కుక్క దాడిలో స్వల్పంగా గాయపడిన తొమ్మిదేళ్ల బాలుడికి మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలను చూసి గ్రామీణులు హైరానా పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే కుక్కల బెడద ఎక్కువగా కనిపిస్తుండడంతో అంతటా ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల సంచారం పెరుగుతుండడంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బజార్‌హత్నూర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలుడు



తెలంగాణ చౌక్‌లో రమేష్ రాథోడ్ ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రమేష్ రాథోడ్ చేసిన సేవలు మరువలేనివి

• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్

ఖానాపూర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా, జిల్లాపరిషత్ చైర్మన్‌గా, ఎంపీగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రమేష్‌రాథోడ్ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రమేష్ రాథోడ్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని ఖానాపూర్‌లోని ఆయనకు బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో పలువురు మాట్లాడారు. అనంతరం రమేష్ రాథోడ్ చిత్రపటానికి పూలమాలలువేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, జిల్లా నాయకులు నల్ల రవీందర్‌రెడ్డి, ఐటీ అండ్ సోషల్ మీడియా ఖానాపూర్ ఇన్‌చార్జి కొండా సురేష్, సీనియర్ బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, చిలుకూరి తిరుమలగిరి, తదితరులున్నారు.

కడెం: దివంగత మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కడెం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రాథోడ్ రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోహన్ నాయక్, శ్రీరామ్, రాపర్తి, శ్రీను, పాలకుర్తి నగేష్, నల్గొండ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోలేకే ఫోన్ ట్యాపింగ్ పేరుతో కుట్ర'

భైంసా, జూన్29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలతో బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేక, బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోలేక కాంగ్రెస్ సర్కార్ ఫోన్ ట్యాపింగ్ పేరిట కుట్ర చేస్తోందని ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలను పార్టీ ప్రతినిధులు అడుగడుగునా అడ్డుకుంటుండటంతో బెంబేలెత్తిపోతున్న సర్కార్ వారిని నిలువరించే ప్రక్రియలో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కుట్రకు తెరలేపిందని తెలిపారు. ఇందులో భాగంగానే బీఆర్‌ఎస్ ప్రతినిధులను టార్గెట్ చేస్తూ విచారణ పేరిట ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. పాలనలో పూర్తిస్థాయిలో వైఫల్యం చెందిన సర్కార్ కక్ష్యపూరిత విధానాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావ్‌లను విచారణ పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. వచ్చేఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కడతారని జోస్యం చెప్పారు.

'పోడు రైతులను అటవీ అధికారులు వేధించడం సరికాదు'

ఖానాపూర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన పోడు రైతు బోసు భూమన్నపై అటవీ శాఖ అధికారుల వేధింపులు సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధానకార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. ఆదివారం తర్లపాడ్‌లోని బోసు భూమన్న వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. పోడు భూములను స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయనే సాకుతో ఒకరిద్దరు రైతులపై కక్ష సాధింపు ధోరణితో అటవీశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్, జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, తదితరులున్నారు.



ముథోల్‌లో బోనాలు ఎత్తుకున్న ముథోల్ ఎమ్మెల్యే



నిర్మల్‌లో మారెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముథోల్‌లో ఘనంగా బోనాల పండుగ

• వేడుకల్లో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముథోల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లో ఆదివారం బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పోలేరమ్మ, దగ్గులవ్వ, పోచమ్మ, మహాలక్ష్మి, ముక్తాదేవి తదితర గ్రామ దేవతలకు బాజాభజంత్రీలతో గంగాజలంతో జలాభిషేకం నిర్వహించి, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొని, బోనాలను ఎత్తుకొని గ్రామదేవతలకు పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని ఆయా కుల సంఘాల సభ్యులు, గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

మేడంపల్లిలో..

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ రేండ్ల పోచమ్మ అమ్మవారి బోనాల పండుగను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి బోనాల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఏఎంఆర్ టవర్స్‌లో..

నిర్మల్ చైన్‌గేట్: తెంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ఆదివారం ఊరూరా ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసం ప్రారంభం నుంచి చివరి దాకా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పిస్తుంటారు. ఈ మేరకు పట్టణంలోని ఏఎస్ రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్‌లో ఆదివారం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. కాలనీ నుంచి సమీపంలోని మారెమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మహాగాంలో..

భైంసారూరల్: మండలంలోని మహాగాంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనచేసి 41 రోజు పూర్తిచేసుకున్న సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి ఆడపడుచులు బోనాలు ఎత్తుకొని ముత్యాలమ్మకు సమర్పించారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా ఆషాఢ మాసంలో వర్షాలు కురిసి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటారు. ఇందులో భాగంగానే ఆదివారం పూజలు నిర్వహించారు.



ఖానాపూర్‌లో బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసం



కల్లూర్‌లో గ్రామ దేవతలకు పూజలు నిర్వహించేందుకు వెళుతున్న గ్రామస్థులు



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఘనంగా భీమన్న పండుగ

కుంటాల, జూన్, 29 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబా(కే)లో ఆదివారం భీమన్న దేవుని పండగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ ఏడాదిలాగే ఈ పండుగను గ్రామస్థులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయం వరకు గ్రామం నుండి భజాభజంత్రిలతో ఊరేగింపుగా వెళ్లి భీమన్న దేవునికి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని భీమన్న దేవుని వేడుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

కుంటాలలో బైకు దగ్ధం

కుంటాల, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అరిగెల గజ్జారాం అనే వ్యక్తికి చెందిన బైకు అనుమానాస్పద స్థితిలో దగ్ధమైంది. కుంటాలకు చెందిన గజ్జారాం తన వ్యవసాయ పనులు ముగించుకొని రోజులాగే ఇంటి ముందు ఉంచాడు. రాత్రి సమయంలో ఒకేసారి పేలుడు శబ్దం వినిపించడంతో కాలనీవాసులు బైకు దగ్ధమవుతున్న సమాచారాన్ని గజ్జారాంకు అందించారు. అయితే అప్పటికే బైకు పూర్తిగా కాలిపోయింది. బాధితుడు కుంటాల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అశోక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధునిక సాగుబడి విధానాలపై అన్నదాతలను చైతన్యపరుస్తాం

భైంసా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాగుబడి విధానాలపై అన్నదాతలకు అవగాహన కల్పించి చైతన్యపరుస్తామని భైంసా, ముథోల్ ఆత్మ కమిటీ చైర్మెన్లు ఎస్.వివేక్, గన్ను నర్సారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం భైంసా పట్టణంలోని ఏపీ నగర్ కాలనీ పరిధిలో శివారు కాలనీలవాసులు నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో ఆత్మకమిటీల ఆధ్వర్యంలో రైతు శిక్షణ తరగతులు నిర్వహించి అన్నదాతలు అధిక దిగుబడులు సాధించేందుకు అవలంబించాల్సిన సాగుబడి విధానాలపై జాగృతపరుస్తామన్నారు. అధిక రసాయన మందుల వినియోగం వలన కలిగే అనర్థాలపై చైతన్యపరుస్తామన్నారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మెన్లు ఎస్.వివేక్, గన్ను నర్సారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కదం మోహన్‌రావ్ పాటిల్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు సాహేబ్‌రావ్ నందడి రాజేందర్‌లను శివారు కాలనీవాసులు తరపున మాజీ కౌన్సిలర్ చందులాల్, మాజీ సర్పంచులు సంజీవ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే,శివారుకాలనీల ప్రతినిధులు చొండి రాజేశ్వర్, అవదూత్ పాటిల్, కపిల్ దగడే, మైనార్టీ ప్రతినిధి హైమద్‌తో పాటు పలువురు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

బ్రహ్మపురి శివ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్‌రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలోని బ్రహ్మపురి మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాప నారాయణ, ఉపాధ్యక్షుడిగా పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా మిరియాల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా జాప అనిల్, కోశాధికారిగా జాప శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా జాప శ్రీనివాస్, జాప శ్రీధర్, ఆకుల రామకృష్ణ, జాప నరేందర్, జాప చంద్ర శేఖర్, ఆకుల నవీన్ ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఏర్పడిన కార్యవర్గ సభ్యులను పలువురు శాలువా, పూలమాలతో సత్కరించారు.

రిలే దీక్షల విరమణ

• బుద్ధా-అంబేడ్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడుదేవిదాస్

భైంసా, జూన్29 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండలం బోర్‌గాం గ్రామంలో బుద్ధవిగ్రహ ఏర్పాటుపై నెలకొన్న సమస్యను ప్రభుత్వం పరిష్కరించడంతో భైంసాలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను విరమిస్తున్నట్లుగా బుద్ధా-అంబేడ్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు దేవిదాస్ వెల్లడించారు. ఆదివారం భైంసాలోని శిబిరం వద్ద దీక్ష విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సంబంధిత సమస్య పరిష్కారం కోసం బుద్ధా-అంబేడ్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 35 రోజులుగా రిలే నిరాహారదీక్షలు కొనసాగించినట్లుగా తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ప్రత్యక్షంగా కృషిచేసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, పరోక్షంగా మద్దతుఇచ్చి పాటుపడిన ఎమ్మెల్యే పవార్‌రామరావ్‌పాటిల్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌లకు కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రిలే దీక్షల్లో కూర్చున్న వారికి ప్రభుత్వ వైద్యులు డా.సురేందర్ పండ్లరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. ఇందులో కమిటీ ఉపాధ్యక్షులు మగ్గిడి దిగంబర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, హట్టేరావ్, కోశాధికారి రాజారాం, సంయుక్త కార్యదర్శి మానిక్ దగ్డే, ప్రతినిధులు సన్ కాంబ్లే దిగంబర్, శ్రీరాములు, శంకర్ చంద్రే, ప్రసంజిత్ ఆగ్రే, గిరిధర్ జంగ్మే, తదితరులు పాల్గొన్నారు.



పండ్ల రసం తాగి దీక్షను విరమిస్తున్న దృశ్యం



ఇచ్చోడలో రోడ్డుపైనే బస్సెక్కుతున్న ప్రయాణికులు

భయంకరంగా ఇచ్చోడ బస్టాండ్

● వర్షాకాలం బురదతో తీవ్ర ఇక్కట్లు ● చీకటి పడితే దొంగల భయం

● బస్టాండుకు శాశ్వత మరమ్మతులు కరవు

ఇచ్చోడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రయాణానికి మూలధారమైన ప్రయాణ ప్రాంగణం ద్వారా ప్రయాణం అంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. వానాకాలం మొదలవ్వడంతో ప్రయాణ ప్రాంగణమంతా తీవ్ర బురదమయంగా మారింది. రాకపోకలు సాగిస్తున్న బస్సులు పదేపదే బురదలో చిక్కుకుపోవడం బస్సు ఎక్కడానికి వస్తున్న ప్రయాణీకులు బురదనంతా దాటుకుంటూ దుస్తులు పాడుచేసుకోవడం నిత్యకృత్యంగా మారింది. బస్సులు రోడ్లపైనే ప్రయాణికులతో కిటకిటలాడుతుంటే.. బస్టాండ్ మాదే అన్నట్లు ఆటోలు ఇష్టారాజ్యంగా నిలుపుతూ ప్రయాణికులకు అవస్థలను కలిగిస్తున్నారు. ప్రయాణ ప్రాంగణాన్ని కనీసం పట్టించుకునే నాథుడు లేకపోవడంతో రాత్రుల్లో చీకట్లలోనే వేచి ఉండాల్సి వస్తోంది. బస్సులు ఇచ్చోడ పట్టణం లోపలినుంచి రాకపోవడంతో మహిళలు కాలినడకన బస్టాండుకు రావాల్సిన పరిస్థితి. ఆడవాళ్లకు బస్సు ప్రయాణం ఫ్రీ అయినప్పటికీ ఇచ్చోడ పరిసరాల మహిళలకు మాత్రం బస్సెక్కాలంటే బస్టాండు వరకు వెళ్లాలి. బస్టాండు వరకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనం ఆటోలో ఏక్కాల్సి వస్తోంది. దీంతో బస్సు రాయితీ కాస్త ఆటోకు చెల్లించుకోవాల్సి వస్తోందని మహిళ ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో మహిళలు భయ పడుతూనే బస్టాండుకు వస్తున్నారు. బస్సులోనికి రాకపోవడంతో రాత్రి పూట ప్రయాణికులు బస్టాండు నుంచి ఇళ్లకు చేరుకోవాలంటే భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇచ్చోడ లోపలి నుంచి బస్సుల రాకపోకలను కొనసాగించాలని స్థానికులు కొరుతున్నారు.



ఇచ్చోడ బస్టాండులో బురదలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు


ఆష్టాలో మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం


బోరిగాంలో మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం


నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

సతతం.. హరితం!

● ప్రారంభమైన వన మహోత్సవం
● 400ల జీపీలు, 396 నర్సరీలు
● జిల్లా లక్ష్యం 53 లక్షల 11 వేలు
● పచ్చదనం పెంపునకు పక్కా ప్రణాళిక

ముథోల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం నుంచి ఆదేశాల మేరకు వన మహోత్సం కార్యక్రమం జిల్లాలో కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 53 లక్షల 11 వేలకు పైగా వివిధ రకాల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను నాటాలని సూచించారు. దీంతో ఈసారి మరింత పకడ్బందీగా మొక్కలను నాటి సంరక్షించడానికి చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది వన మహోత్సవం కోసం అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. గతంలో నాటిన మొక్కలు ఆశాజనకంగా పెరగకపోవడంతో ఈసారి పకడ్బందీగా చర్యలు చేపట్టారు. మొక్కల సంరక్షణ పక్కాగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. గ్రామాల్లోని నర్సరీల్లో పెంచిన మొక్కలను కావాల్సిన ప్రాంతాలకు తరలించి నాటించేందుకు వివిధ శాఖల అధికారులు ప్రణాళికలను తయారు చేశారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతలను గ్రామాల్లో ఉపాధి హామీ కూ లీలు, పట్టణాల్లో అయితే మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. జి ల్లాలో 400ల గ్రామ పంచాయతీలకు గాను 396 నర్సరీల్లో ఈజీఎస్ ద్వారా మొక్కల పెంపకం, అటవీ శాఖ ఆధ్వర్యంలో 3 నర్సరీల్లో 1 లక్ష 80 వేలు, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 3 నర్సరీల్లో 2 లక్షల 20 వేలు మొత్తం జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సుమారు 57 లక్షల మొక్కలు పెంచారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 24 లక్షల మొక్కలు, ఇంటింటా పంపిణీ చేసే మొక్కలు 9 లక్షలు, వివిధ శాఖల ద్వారా 9 లక్షల 59 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశిం చుకున్నారు. జిల్లాలో ఉన్న ప్రతీ కుటుంబానికి మొక్కలను పంపిణీ చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. గతంలో మాదిరిగానే పండ్ల మొక్కల (జామ, నిమ్మ, ఉసిరి, సీతాఫలం, అల్లనేరేడు)తో పాటు ఔషధ మొక్కలను పంపిణీ చేయడం కోసం జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం విజయవంతానికి అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లా ఉన్నత స్థాయి అధికారులతో పాటుగా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఆయా స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన సంఘాలు, ప్రజల సహకారంతో వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామ పంచాయతీ చెరువుల కట్టలపై, ఖాళీ స్థలాల్లో ఈత, ఖర్జూర మొక్కలను నాటడం కోసం నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేసుకున్నారు. వ్యవసాయ భూముల్లో, గట్లపైన టేకు, సుబాబుల్, యూకలిప్టస్, ఈత, ఖర్జూర వంటి మొక్కలను నాటనుండగా, ఖళీ స్థలాలు, గ్రామీణ రోడ్లు, రహదారులకు ఇరువైపులా వేప, కానుగ, వంటి మొక్కలను నాటుతారు. వర్షాలు విస్తృతంగా కురిసిన వెంటనే ఈ కార్యక్రమం మరింత ఊపు అందుకోనుంది. కొద్దిపాటి వర్షాలకే జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఈ వన మహోత్సవ కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించి మొక్కలు నాటి గ్రామ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆగస్టు వరకు ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ముందుకెళ్తుంది.

వన మహోత్సవం విజయవంతం చేస్తాం..
- ఓస ప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్

సమష్టి కృషితో ఈ వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయ వంతం చేస్తాం. ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ శా ఖలకు లక్ష్యాలను కేటాయించాం. మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కేవలం ప్రభుత్వమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలల్లో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. అటవీ శాతం పెరిగితేనే పర్యావరణాన్ని పరిరక్షించే అవకాశం ఉంటుంది. జిల్లా అంతటా మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

కేజీబీవీలో ప్రవేశాల కోసం పోటీ తీవ్రం

● పరిమితికి మించి అడ్మిషన్లు తీసుకోవద్దని డీఈవో ఉత్తర్వులు
● ఎమ్మెల్యే ఏలేటి చొరవతో ఆ ఉత్తర్వుల రద్దు

లక్ష్మణచాంద, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రవేశాల కోసం తీవ్రమైన ఆరాటం కొనసాగుతున్నట్లు ఆదివారం తెలిసింది. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అనాథ, పేద బాలికలకు ఈ విద్యాలయాల్లో పూర్తి వసతి సౌకర్యాలతో చదువుకునే అవకాశం ఉంది. ఇక్కడ పని చేస్తున్న ప్రత్యేక అధికారి రాంపెల్లి నవిత బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చటం కారణంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించటంతో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకంటే ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకే అత్యధిక మార్కులు రావటంపై ఆరాటానికి కారణమైంది. దీంతో ఈ పాఠశాల, కళాశాలలో గల విద్యార్థినుల సంఖ్య 400పైగా చేరింది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాలికలతో పాటు ఇతర మండలాల్లోని గ్రామాల బాలికలు కూడా ఈ పాఠశాల ప్రవేశాల కోసం ఆసక్తి చూపటం గమనార్హం.

కస్తూర్బా విద్యాలయాల్లో ప్రవేశాల కోసం ఆసక్తి

మండలంలోని ఆయా గ్రామాల్లో గల జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు టీసీలు తీసుకుని ఈ కస్తూర్బా విద్యాలయాల్లో ప్రవేశాల కోసం ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో బాలికల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ కారణంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డీఈవోకు అసలు విషయం చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన స్పందించి జిల్లాలోని కస్తూరిబా విద్యాలయాల్లో పరిమితికి మించి అడ్మిషన్లు తీసుకోవద్దని, పరిమితికి మించిన విద్యార్థులకు అయ్యే ఖర్చుకు సంబంధించిన నిధులను మంజూరు చేయబోమని, ఆయా విద్యాలయాల ప్రత్యే క అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల విషయం తెలిసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ సేరకంటి ముత్యం రెడ్డి, ఇతర నాయకులు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల ఇబ్బందు లను దృష్టిలో పెట్టుకుని ఆయన కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆ ఉత్తర్వులను ఆదివారం రద్దు చేయించారు.



లక్ష్మణచాందలో కస్తూర్బా గాంధీ విద్యాలయం

వసతి సౌకర్యాలు మెరుగుపరచాలి..

400లకు పైగా విద్యార్థినులు ఉన్న ఈ విద్యాలయంలో పట్టుమని 10 మరుగుదొడ్లు కూడా లేవు. ఈ మరుగు దొడ్లను కనీసం 25కి పెంచాలి. అలాగే పెరిగిన విద్యార్థినులకు అనుగుణంగా సెక్షన్లు ఏర్పాటు చూసి సరిపడా ఉపాధ్యాయులను నియమించాలి. విద్యార్థుల సంఖ్యకు అను గుణంగా అయ్యే తలసరి ఖర్చుకు సంబంధించి నిధులు కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ఆయా తరగతి గదు ల్లోను, వసతి గదుల్లోను సరిపడా ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


బోనాలు సమర్పించేందుకు వెళుతున్న తాంసి గ్రామస్థులు

ఘనంగా బోనాల పండుగ

తాంసి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ కార్యక్రమాన్ని ఆదివారం తాంసి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. గంగా నీళ్ల తీసుకువచ్చి మేళా వాయిద్యాలతో గ్రామదేవతలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం వేప కొమ్మలు పట్టుకొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళహారతులు చేత పట్టుకొని గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ నైవేద్యాలు సమర్పించారు. మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకొని మేకలను కోళ్లను బలిదానం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.

పాఠశాల ఆవరణ బురదమయం

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


బాలికల పాఠశాలలో వర్షపు నీటితో బురదమయంగా మారిన గ్రౌండ్

బోథ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

● **విద్యార్థుల సమస్యను పరిష్కరించండి**

విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లాలంటే బురదకాళ్లతో వెళ్లలేకపోతున్నారని విద్యార్థులు ఇబ్బందులను గుర్తించి సమస్యను పరిష్కరించాలని బిజెపి నాయ కులు జక్కుల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డగా మారిందని ఆయన పేర్కొన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జోరుగా వ్యవసాయ పనులు

భీంపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలంలో రైతులు వ్యవసాయ పనుల్లో లీనం అయ్యారు. సరిపడా వర్షాలు కురుస్తుండటంతో చెల్లలో ఏపుగా పెరిగిన పత్తి,మొక్క జొన్న, కంది సక్లలో అరకలతో కలుపు నివారణ పనులు చేస్తున్నారు. ఎరువులు చల్లుతున్నారు. గడ్డి పెరకుండా మందులను స్ప్రే చేస్తున్నారు. వ్యవసాయ పనులతో గ్రామాలలో కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది. ఏ చేనులో చూసినా పనులు చేస్తున్న రైతు కూలీల సందడి కనిపిస్తుంది.

ఫొటో న్యూస్


పిప్పల్‌కోటి శివారు ప్రాంతంలో ఒక ఎడ్ల జతతో మూడు దౌరాల చదును చేస్తున్న దృశ్యం


పిప్పల్‌కోటి శివారు ప్రాంతంలో పత్తి పంటలో దౌరా కొడుతున్న రైతు


పిప్పల్‌కోటి శివారు ప్రాంతంలో పత్తి పంటలో కలుపు మొక్కలను తీస్తున్న మహిళలు


పిప్పల్‌కోటి శివారు ప్రాంతంలో పత్తి పంటకు ఎరువులు చల్లుతున్న కూలీలు


పాఠశాలలో విద్యార్థులు

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వ బడి ముద్దు!

● ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఆనందంలో బడి దారి పడుతున్న విద్యార్థులు

నార్నూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ గిరిజన ప్రాంత ఆదివాసీ పిల్లలు ఇక ప్రభుత్వ వైపే బడి మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ వద్దు ప్రభుత్వ బడి ముద్దు అంటు ప్రతీ రోజ. పాఠశాలకు వెళ్తున్నారు. మండలంలోని ముక్తాపూర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ బడికి చుట్టూ పక్కల గ్రామాల అయిన సొనాపూర్, ముక్తపూర్, బెతల్ గూడా గ్రామాల నుంచి ఆటోల ద్వారా విద్యార్థులు రాకపోకలు చేస్తున్నారు.గతం కన్న ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరుగుతూ అడ్మిషన్‌లు నడుస్తున్నాయి. ఉపాధ్యాయులు కృషి ఫలితం ఐదో తరగతి ఐదుగురు గిరిజన విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉత్తీర్ణత సాధించి గురుకులం సీటు పొందినారు. ప్రస్తుతానికి 45 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



(ఇన్‌సెట్‌లో)అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మాజీ చైర్‌పర్సన్ జుగను సుమిత్ర

ముక్తాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల

అటలతోనే మానసిక ఉల్లాసం ..

విద్యతోపాటు మానసికో ల్లసానికి క్రీడలు దోహదం చేస్తాయి. ఉపాధ్యాయులు అట వస్తువు క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందించారు.

పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పించాలి.

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రైవేట్‌లకు దీటుగా మెరుగైన ఉచిత విద్యను అందించే దిశగా డిజిటల్ బోర్డ్‌లు ఏర్పాటు చేసి వారికి అర్థం అయ్యేలా సహకరించాలి. అమ్మా ఆదర్శ పాఠశాలలు ద్వారా భవనానికి పూర్తిగా రంగులు వేసి మర్గుడొడ్డలకు స్లాబ్ పైకప్ప వేయాలి, మంచి నీటి సౌకర్యం కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. పాఠశాల భవనానికి చుట్టూ పక్కల గోడ నిర్మాణం పనులు చేపట్టాలి. విద్యార్థులు పౌష్టిక ఆహారం బాగు పడేలా మధ్యాహ్న భోజనంలో మెనూ పలు మార్పులు చేసి వారం రోజులు వారీగా మెనూ కింద రాగి జావ, పల్లి పట్టిలు, సేపు, అరటి, జమ, పండ్లు, పాలు, బిస్కెట్ సైతం ప్రభుత్వం అందిస్తే అసలుకే విద్యార్థులు ప్రైవేట్‌కు పోరు ప్రభుత్వ బడులకే వస్తారు. అధికారులు దృష్టి సారించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ జుగాను సుమిత్ర అభిప్రాయపడ్డారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

నిర్మల్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మాజీ నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు శనిగారపు చిన్నయ్య, సత్యం చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టైగర్ ట్రాన్స్ లొకేషన్

మహారాష్ట్ర టు కవ్వాల్





కవ్వాల్‌లో సంచరిస్తున్న శాకాహార జంతువులు (ఫైల్)

కవ్వాల్ అభయారణ్యం

- త్వరలో సాకారం కానున్న పెద్దపులుల తరలింపు
- రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఇదివరకే చర్చలు
- పెద్దపులుల సంతతిని పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదనలు
- అభయారణ్యంలో అనుకూల పరిస్థితుల పరిశీలన
- మైసంపేట్, రాంపూర్ ప్రాంతాలలో ఇటీవల చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ పర్యటన
- జనసంచారం, శాకాహార జంతువుల సంఖ్యపై అధ్యయనం
- టైగర్ ట్రాన్స్ లొకేషన్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం
- త్వరలోనే తడోబా నుంచి కవ్వాల్ టైగర్ జోన్‌లోకి జంటలుగా రానున్న పెద్దపులులు

ఖానాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓవైపు గోదావరి నది, మరోవైపు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల మధ్యగల అభయారణ్యాన్ని పెద్దపులుల సంరక్షణకు అనుకూల ప్రాంతంగా భావించి 2012లో భారత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని కవ్వాల్ పెద్దపులుల సంరక్షణ కేంద్రంగా గుర్తించింది. అప్పటినుంచి కవ్వాల్ అభయారణ్యాన్ని పెద్దపులులకు ఆవాసంగా మార్చేందుకు అధికారులు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. మహారాష్ట్ర ప్రాంతంలోని తడోబా అడవుల నుంచి నేరుగా కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులుల రాకపోకలు కొనసాగించేలా ఓ కారిడార్‌ను ఏర్పాటుచేశారు. పెద్దపులుల వేటకు అనుకూలంగా ఉండేందుకు ఈప్రాంత అడవుల్లో శాఖాహార జంతువుల సంఖ్యను ఘననీయంగా పెరిగేలా చర్యలు చేపట్టారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో పలుల సంరక్షణకు చేపట్టిన చర్యలు క్రమేపీ సఫలీకృతమయ్యాయి. దీంతో కవ్వాల్ అభయారణ్యం పరిధిలోకి గతకొన్నేళ్లు పెద్దపులుల రాకపోకలు పెరిగాయి. ఈనేపథ్యంలో కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులుల సంతతిని పెంపొందించేందుకు అటవీశాఖ టైగర్ ట్రాన్స్‌లొకేషన్ అనే ప్రతిపాదనను ప్రభుత్వం ముందు పెట్టింది. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వంతో ఈ టైగర్ ట్రాన్స్ లొకేషన్‌పై చర్చలు జరుపుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. త్వరలోనే టైగర్ ట్రాన్స్ లొకేషన్ సఫలీకృతం అవుతుందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.



సంచరిస్తున్న చుక్కల దుప్పులు (ఫైల్)

కవ్వాల్‌కు అతిథిలా వచ్చిపోతున్న పులులు

టైగర్ జోన్‌గా గుర్తించబడి పులుల సంరక్షణ కోసం ఎన్నో అభివృద్ధి పనులతో ముందుకు సాగుతున్న కవ్వాల్ అభయారణ్యంలో ఆవాసం ఉండాల్సిన పెద్దపులులు మాత్రం అతిథిలాగే వచ్చి వెళ్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులులు మహారాష్ట్ర ప్రాంతం నుంచి తరుచూగా రావడం, కొన్నాళ్ల ఈప్రాంతం అడవుల్లో సంచరించి మహారాష్ట్ర బాట పట్టడం పారిపాటిగా మారింది. కొద్దిరోజుల క్రితం 'జానీ' అనే నామకరణం గల ఓ పెద్దపులి మహారాష్ట్రలోని తడోబా అడవుల నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ అడవుల్లో ప్రవేశించి అక్కడి నుంచి నిర్మల్‌లోని అడెల్లి, మహబూబాఘాట్, తంద్రా, ఖానాపూర్, పెంబి ప్రాంతాల మీదుగా మంచిర్యాల జిల్లాలోని ఇంధన్‌పెల్లి, జన్నారం తదితర కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో గల అభయారణ్యంలో సంచరించి తిరిగి మహారాష్ట్ర ప్రాంతానికి వెళ్లిపోయింది. ఇలా ప్రతిసారి కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులులు చుట్టంచూపుగా వచ్చిపోతున్నాయి. దీనికి గల ఎన్నో కారణాలను అన్వేషించిన అధి కారులు కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులు లు తిష్ఠవేసుకునేలా చర్యలు చేపట్టాలని నిర్ణ యించుకున్నారు. అందులో భాగంగానే టైగర్ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిని అవలంబించి సక్సెస్ కావాలని ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు.

అసలేంటీ టైగర్ ట్రాన్స్‌లొకేషన్

గత నెల రోజులుగా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో టైగర్ ట్రాన్స్‌లొకేషన్ అనే మాట అధికార వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులులు కేవలం చుట్టపు చూపుగా వస్తున్న నేపథ్యంలో పులులు ఈ ప్రాంతంలోనే ఆవాసం ఏర్పరచుకునేలా చేస్తున్న ఏర్పాట్లలో ఓ భాగమే టైగర్ ట్రాన్స్ లొకేషన్. భారతదేశంలో పులుల సం ఖ్యను పెంచేందుకు జన్యువైవిధ్యాన్ని కాపాడేందుకు ఒక ప్రాం తం నుంచి పులులను మరో ప్రాంతానికి తరలిస్తారు. ఈ టైగర్ ట్రాన్స్‌లొకేషన్ అనే విధానంలో పెద్దపులుల సంతతి ఎక్కువగా ఉన్న ప్రాంతం నుంచి ఆడ, మగ పులులను పట్టుకుని పులుల సంతతి పెంపొందించాలనుకునే అభయారణ్యంలో జంటలుగా పలువురు వదిలిపెడతారు. పులులను వదిలిపెట్టే కంటే ముందే అవి తమ ఆవాసాన్ని స్థిరపరచుకునేలా శాకాహార జంతువులను పెంచడంతోపాటు అడవిలో అలజడిని తగ్గిస్తారు. ఇలా పులులను జంటగా వదిలేయడంతో అవి తోడును వెతుక్కుంటూ ఇతర దూరప్రాంతాలకు వెళ్లకుండా తమ ఆవాసాన్ని స్థిరపరచుకుంటాయని చెబుతున్నారు.

త్వరలో తడోబా టు కవ్వాల్ టైగర్ ట్రాన్స్‌లొకేషన్

పెద్దపులుల సంతతిని పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన కవ్వాల్ టైగర్ జోన్‌లోకి పులులు రావడం తిరిగి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం జరుగుతోంది. దీంతో కవ్వాల్ టైగర్ జోన్ కేవలం పెద్ద పులుల రాకపోకలకు మాత్రమే వేదికగా మారింది. ఈ నేపథ్యంలో కవ్వాల్ టైగర్ జోన్‌లో పెద్ద పులుల శాశ్వతఆవాసానికి అధికారులు టైగర్ ట్రాన్స్ లొకేషన్ విధానాన్ని అవలంబించాలని నిర్ణయించారు. కవ్వాల్ టైగర్ జోన్ అధికారులు రాష్ట్రప్రభుత్వం ఎదుట ఈ ప్రతిపాదనను ఉంచడంతో కొద్దిరోజులుగా తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య టైగర్ ట్రాన్స్ లొకేషన్‌పై చర్చలు జరిపినట్లు చెబుతున్నారు. ఈచర్చల్లో టైగర్ ట్రాన్స్‌లొకేషన్‌కు సానుకూలంగానే మహారాష్ట్ర ప్రభుత్వం స్పందించినట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. చర్యలు సానుకూలంగా సాగడంతో త్వరలోనే మహారాష్ట్ర ప్రాంతంలోని తడోబా నుంచి ఓ మూడు ఆడపులులు, మరో మూడు మగ పులులను కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోకి ఇక్కడి అభయారణ్యంలో వదిలిపెట్టనున్నట్లు చెబు తున్నారు. అన్నీ సవ్యంగా సాగితే టైగర్ ట్రాన్స్ లొకేషన్‌కు ఎంతో కాలం పట్టదని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ హైదరాబా ద్ అధికారి పర్యటించారు. మైసంపేట్, రాంపూర్ పాత గ్రా మాల ప్రాంతాన్ని కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అభయారణ్యంలో జనసంచారం, శాకాహార జంతువుల సంఖ్యపై ఆయన క్షేత్రస్థాయిలో అధ్య యనం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. టైగర్ ట్రాన్స్ లొకేషన్‌కు అడుగులు ముందుకు పడుతున్న క్రమంలో అధికారుల పర్యటనలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. త్వరలోనే తడోబా ప్రాంతం నుంచి కవ్వాల్‌కు పెద్ద పులులను తరలిస్తూ కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఇక పులులు తమ శాశ్వత ఆవాసాన్ని ఏర్పర్చుకునే రోజులు ఎంతో దూరంలో లేవని చెబుతున్నారు. ఈ కబురు ప్రకృతి ప్రేమికులకు ఎంతగానో తీపికబురుగా నిలుస్తోందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టైగర్ ట్రాన్స్ లొకేషన్‌పై చర్చలు జరుగుతున్నాయి

- నాగిని భాను, డీఎఫ్‌వో, నిర్మల్

టైగర్ ట్రాన్స్ లొకేషన్ అంశంపై తెలంగాణ మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇటీవల కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో హైదరాబాద్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ సైతం పర్యటించారు. ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. టైగర్ ట్రాన్స్ లొకేషన్ జరిగితే మహారాష్ట్ర తడోబా అడవుల నుంచి కవ్వాల్ టైగర్ జోన్‌కు పెద్దపులులను తరలించి వాటి సంతతిని పెంపొందించేందుకు చర్య లు చేపడుతాం. పెద్దపులి ఆవాసం కోసం అభయారణ్యంలో అన్ని చర్యలు కొనసాగుతున్నాయి.



గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర నుంచి నిర్మల్ జిల్లాలోకి వస్తూ మహబూబ్ ఘాట్ వద్ద వాహనదారుల కెమెరాకు చిక్కిన పెద్దపులి (ఫైల్)



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన డీఈవో

నిర్మల్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని కురన్నపేట్‌లో గల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం డీఈవో పి.రామారావు సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. పాఠశాలలో తరగతులు జరిగే విధానాన్ని వారినుంచి ఆరా తీశారు. వారితోఆదివారం సందర్భంగా ఆటవిడుపుగా విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆట ఆడారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, బాగా తిని ఆరోగ్యంగా ఉండాలని, అందరూ కలిసి ఆటలు ఆడాలని అన్నారు. అదేవిధంగా పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్యూటీ టీచర్ రవి, వంట సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడుతూనే విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

నిర్మల్‌చైన్‌గేట్, జూన్29 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాడుతూనే విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి శశిరాజ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) నిర్మల్ జిల్లాకార్యవర్గ సమావేశాన్ని నిర్మల్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చినపిలుపు మేరకు ప్రభుత్వంఇచ్చిన హామీలైన పెండింగ్ డీఏ విడుదల, 317 స్థానికత సమస్య పరిష్కారం, సీపీఎస్ సమస్య, ఎన్‌ఈపీ రాష్ట్రంలో ప్రవేశపెట్టడం, రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం తదితర ప్రముఖ విద్యారంగ సమస్యలపై చర్చ తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్ కుమార్, సుదర్శన్, జిల్లా కార్యవర్గసభ్యులు జిలకరి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవ వేడుకలు

నిర్మల్‌రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఆదివారం జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గణాంక శాస్త్ర ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ పీసీ మహాలనోబీస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి జీవరత్నం మాట్లాడారు. ప్రొఫెసర్ మహాలనోబీస్ దేశానికి బలమైన గణాంక మౌళిక వ్యవస్థను రూపొందించారన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ జూన్ 29న జాతీయ గణాంక దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ 2023-24కు సంబంధించిన జిల్లా గణాంక హ్యాండ్ బుక్‌ను విడుదల చేశారు. వేడుకల్లో రిటైర్డ్ గణాంక శాఖ అధికారులు మోహన్ దాస్, హన్మండ్లు, డిగ్రీకళాశాల అధ్యాపకులు రమేష్, తదితరులున్నారు.

జాతీయస్థాయి ఒలంపియాడ్ పరీక్షలో జిల్లా విద్యార్థికి జాతీయస్థాయి ప్రథమ ర్యాంక్

నిర్మల్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సెమ్స్ జాతీయస్థాయి ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలో విజయ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి షణ్ముఖ మొదటి ర్యాంక్ సాధించి రూ.13,333 క్యాష్ అవార్డుతో పాటు మెమొంటో, మెడల్ సర్టిఫికెట్ గెలుపొందారు. అలాగే షేక్ అర్హాన్, రిత్విక, గీతిక రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్‌ను సాధించారు. అలాగే రాష్ట్రస్థాయి నాలుగవ ర్యాంక్ లోపు 21మంది విద్యార్థులు, రాష్ట్రస్థాయి పదవ ర్యాంక్ లోపు 102 మంది ర్యాంకులు సాధించారు. శనివారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకళావేదికలో విద్యార్థులు అవార్డు పొందారు.

బాసరలో భక్తుల రద్దీ



అక్షర శ్రీకార మండపంలో భక్తుల రద్దీ



గోదావరి స్నానఘట్టం వద్ద భక్తుల సందడి

బాసర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి కొనసాగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో రద్దీ పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయం, గోదావరి నది తీరం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. గోదావతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది తీరాలగల శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. మరోపక్క సరస్వతీ అమ్మవారి ఆలయంలోని రెండు అక్షర శ్రీకారం మండపాల్లో భారీగా పూజలు నమోదయయ్యాయి. రెండు మండపాల్లో కలిపి సుమారు 350 మందికి పైగా చిన్నారులు అక్షర శ్రీకారం జరిపించుకున్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



లబ్ధిదారురాలికి ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆదివారం అందజేశారు. గుండంపల్లి, బన్సపల్లి, సిర్గాపూర్, కాల్వ తండా గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టి. విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు నీడ కల్పించాలన్న ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు. లబ్ధిదారులు తప్పనిసరిగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. దశల వారీగా బిల్లులు లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహేష్ రెడ్డి, వేముల దైతు, ముసుకు సునీత, గంగామణి పాల్గొన్నారు.

9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

ఖానాపూర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం జూలై 9న కార్మికవర్గం నిర్వహిస్తున్న మరో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని బీర్నంది గ్రామంలో నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు గంగామణితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బీర్నందిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణి జెండాను ఆవిష్కరించి అనంతరం సీఐటీయూ ఖానాపూర్ మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డొమ్మటి స్వప్న, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ, స్వామి, లత, మండల ప్రధాన కార్యదర్శి గజ్జల రవి, సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, నాగరాజు, మంగ, కోశాధికారిగా సుజాతలను ఎన్నుకున్నట్లు సురేష్ పేర్కొన్నారు.

టీటీడీలో జిల్లా కళాకారుల నృత్య ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న స్వరూపిని నృత్య కళాక్షేత్ర కళాకారులు



ప్రదర్శన ఇచ్చిన నృత్యమాల నాట్య అకాడమీ కళాకారులు

నిర్మల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలోని ఆస్థాన మండపం వద్ద నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమంలో జిల్లా నృత్య కళాకారులు పాల్గొన్నట్లు నృత్య గురువులు సంగినేని నవ్య వినయ్, ఏలేటి అంజలిరెడ్డి తెలిపారు. ఈ నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగిందని, పట్టణంలోని స్వరూపినిని నృత్య కళాక్షేత్రం, నృత్య మాల నాట్య అకాడమీ కళాకారులు ఇట్టి ముద్దుగారే, భావములోన, సతులలోన, ఆస్తపతి, అదివో అల్లాదివో, గరుడ గమన, చక్కని తల్లి, కొండలలో నెలకొన్న తదితర పాటలకు నృత్యం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువులు అభినందించారు.



పాఠ్యపుస్తకాల గదికి తాళం వేసి సీజ్ చేస్తున్న దృశ్యం

పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

నర్సాపూర్(జి), జూన్29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని రాంపూర్ గ్రామంలో ఉన్న సెయింట్ థామస్ పాఠశాలలో అధిక ధరలకు పాఠ్య పుస్తకాల విక్రయాలు, ఫీజుల దోపిడీపై ఏబీవీపీ ఆదివారం తీవ్ర అందోళన చేపట్టింది. ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులతో పాటు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని ఏబీవీపీ కన్వీనర్ శశిధర్ మండిపడ్డారు. దీనిపై త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చేశారు.

తక్షణ చర్యలు చేపట్టిన విద్యాశాఖ అధికారులు

విద్యార్థి సంఘాల ఫిర్యాదుమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో మండల విద్యాశాఖ అధికారి సాయన్న తక్షణమే రంగంలోకి దిగారు. ఆదివారం రాంపూర్ గ్రామంలోని సెయింట్ థామస్ పాఠశాలకు చేరుకుని, అక్కడ అక్రమంగా విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సాయన్న మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. సీజ్‌చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను గదిలో భద్రపరిచామన్నారు. ఆయనవెంట మిస్ కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: ఎంఈవో

ప్రైవేట్ పాఠశాలలు తమ పాఠశాల ఫీజుల వివరాలు, ఉపాధ్యాయుల వివరాలను నోటీసు బోర్డులో స్పష్టంగా కనిపించే విధంగా ఉంచాలని ఎంఈవో సాయన్న ఆదేశించారు. అర్హత పొందిన ఉపాధ్యాయులతోనే బోధించాలని సూచించారు. నిబంధనలు పాటించనిచో పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే అనుమతులు లేని హాస్టళ్లపై దాడులు నిర్వహిస్తామని తెలిపారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ

నిర్మల్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని 39వ వార్డు గుల్జార్ మార్కెట్ కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ ఆదివారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఇందులో మాజీ కౌన్సిలర్ తౌహీద్‌ఉద్దీన్, రఫ్వు, అజార్ హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్‌మెంట్, వార్డు ఆఫీసర్ సందీప్, హుస్సేన్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సత్తనపెల్లి పీఏసీఎస్ చైర్మన్ దంపతులపై దాడి

ఖానాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సత్తనపెల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమందశ్రీనివాస్, స్వప్న దంపతులపై ఆదివారం సాయంత్రం దాడి జరిగింది. ఆమంద శ్రీనివాస్ తన భార్య స్వప్నతో బైకుపై గోసంపల్లెకి వెళ్తుండగా గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గ్రామానికి చెందిన ఉపాలి అనే వ్యక్తి బైకుకు అడ్డు తగిలాడు. కొంతకాలంగా తమపై నిరాధార ఆరోపణలు చేస్తుండడమే కాకుండా తమ బైకుకు ఎందుకు అడ్డు తగిలావని భార్యాభర్తలు ప్రశ్నించగా సదరువ్యక్తి తన భార్య స్వప్నతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. తన భార్య పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాలిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా తనపై కర్రతో దాడి చేశాడని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఘటనలో శ్రీనివాస్ కుడి చేయి వేళ్లకు, స్వప్న ఎడమ చేయికి గాయాలయ్యాయని శ్రీనివాస్ దంపతులు పేర్కొన్నారు. ఈ విషయమై ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్‌ను వివరణ కోరగా జరిగిన ఘటన తన దృష్టికి వచ్చిందని, అయితే ఇంకా రాతపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.